

17న జాబ్‌మేళా

ధర్మవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరాలు లోపు ఉన్న వారు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15వేలనుంచి రూ.25వేల వరకు జీతం ఉంటుందన్నారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు.

హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజా చైతన్యంతోనే తిప్పికొట్టడం సాధ్యం

మానవహక్కుల వేదిక మహాసభల్లో వక్తలు

(వివరాలు 6, మెయిన్‌లో..)



అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

విస్తరిస్తున్న పొగాకు సాగు

ఆసక్తి చూపుతున్న రైతులు

రెండు మండలాల్లో 150 ఎకరాల్లో సాగు

ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ కంపెనీ

- వివరాలు 6లో...



ముగిసిన గంధం మహోత్సవం



పూజకు గంధాన్ని తీసుకెళ్తున్న పీరాధిపతి తాజ్‌బాబా

- వివరాలు 7లో

ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి గిరి ప్రదక్షిణను శనివారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. మొదట ప్రశాంతి నిలయం గణేశ్ గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి రథాన్ని లాగుతూ భక్తిపాటలు పాడుతూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, ఎనుములపల్లి గణేశ్‌సర్కిల్, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, గోపురంరోడ్డుమీదుగా తిరిగి గణేశ్ గేటు వద్దకు రథాన్ని చేర్చారు. అక్కడ మంగళహారతితో గిరిప్రదక్షిణ ముగించారు.

సాయిరాం.. సాయిరాం..

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గీతాలు ఆలపిస్తున్న భక్తులు

పుట్టపర్తి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా భక్తులు చేపట్టిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు సత్యసాయి భక్తులను అలరించాయి. పర్తియాత్ర పేరిట కృష్ణా జిల్లా భక్తులు శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయి కుల్వంతు సభామంటపంలో సత్యసాయిఅష్టోత్తర శతనామావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి బృందావన సుగానలహరి పేరిట బాలవికాస్ చిన్నారులు సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తిపాటలు, నృత్యంతో భక్తులను అలరించారు. ఆ జిల్లా సేవాసంస్థల ప్రెసిడెంట్ చంద్రశేఖర్ అక్కడ చేపట్టిన సేవల గురించి వివరించారు.

కూటమి జయభేరి

ఏకపక్షంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

214 మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నిక



వెంగళమ్మచెరువు సాగునీటి సంఘం ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు



ఎన్నికైన సాగు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు జిల్లాలో ఏకగ్రీవం అయ్యాయి. జిల్లాలో 214 చిన్నతరహా చెరువులు 16 మధ్యతరహా ప్రాజెక్టుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. తొలుత ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యుల ఎన్నిక నిర్వహించారు. మైనర్ ఇరిగేషన్, చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆరుగురు ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యుల నుంచి ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. సభ్యుల్లో అధ్యక్ష ఉపాధ్యక్షులను చేతులెత్తే విధానంలో ఎన్నుకున్నారు. అలాగే మధ్యతరహా ప్రాజెక్టులో 16ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యులను ఎన్నుకున్నారు. మధ్యతరహా ప్రాజెక్టులకు ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యుల ఎన్నిక నిర్వహించగా అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగాల్సిఉంది. సాగునీటి ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులకు డిక్లరేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు అందజేశారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో 44 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 318 ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల్లో 308 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఒక్కచోట ఓటింగ్ జరిగింది. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో కొత్తచెరువు, బుక్కపట్నం, ఓడీచెరువు, నల్లమాడ గోరంట్ల, పుట్టపర్తి మండలాల్లో 26 సాగునీటి సంఘాల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. కదిరి డివిజన్‌లో 18 చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో 140 సాగునీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. 870 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 860 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడు చోట్ల ఓటింగ్ జరిగింది. ధర్మవరం డివిజన్‌లో తొమ్మిది, పెనుకొండలో 3 ప్రాదేశిక నియోజక వర్గాలకు క్లియర్ వేకెన్సీగా ప్రకటించారు. సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ రత్న ఆధ్యర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

అన్నీ కూటమి వశం

సాగునీటి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలో టీడీపీ మద్దతు రైతులే అత్యధికంగా ఎన్నికయ్యారు. జనసేన, బీజేపీ మద్దతు వర్గీయులకు పలు చోట్ల అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యుల ఎన్నికలో ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాలో 214 మైనర్ ఇరిగేషన్ చెరువుల సాగునీటి సంఘాలు అధికార కూటమి మద్దతుదారుల వశం అయ్యాయి. అన్ని నియోజక వర్గాల్లో జనసేన, బీజేపీ మద్దతుదారులకు అధ్యక్ష ఉపాధ్యక్ష పదవుల్లో అవకాశం కల్పించారు. సాగునీటి ఎన్నికల్లో అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులకు కూటమి నేతలు పోటీపడిన ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు సమన్వయంతో ఏకగ్రీవమయ్యేలా చూశారు. ఇది ఎన్డీఏ కూటమి విజయమని జిల్లా టీడీపీ అధ్యక్షుడు వడ్డె అంజినప్ప పేర్కొన్నారు. ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన విషయం తెలిసిందే.

బాధ్యతగా మెలగండి: మంత్రి సవిత

సోమందేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘం ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన అభ్యర్థులు, కమిటీ సభ్యులు బాధ్యతగా మెలగాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె సోమందేపల్లి చెరువుకు సంబంధించి అధ్యక్షుడిగా ఎన్నికైన వడ్డి నారాయణ, ఉపాధ్యక్షులు సాయినాథ్, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా చెరువులకు సంబంధించి ఎన్నికైన అభ్యర్థులు తమ బాధ్యతలను విస్మరించకుండా పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆమెను కమిటీ సభ్యులు శాలువలతో సన్మానించారు. మండలంలో 17పెద్ద చెరువులకు సంబంధించి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, వడ్డె సూరీ, మాజీ ఎంపీపీ వెంకటేశులు, వెంకటరమణ, నరసింహులు, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, కురుబ శ్రీరాములు, సూర్యనారాయణ, ప్రభాకర్, శీన, తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లి సాగునీటి సంఘం అభ్యర్థులను అభినందిస్తున్న మంత్రి సవిత

గోరంట్లలో రెండు సంఘాల ఎన్నికల వివాదం

పులేరులో జరగని ఉపాధ్యక్ష ఎన్నిక

గోరంట్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 చెరువులకు జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో 9 చెరువులకు ఏకగ్రీవంగా జరిగాయి. పులేరు చెరువు, కమ్మలవాండ్లపల్లి మండ్రోచెరువు సంఘాల ఎన్నికలు మాత్రం వివాదంగా మారాయి. కమ్మలవాండ్లపల్లి, మండ్రోచెరువుకు కొండాపురం పాఠశాలలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానం కోసం వేణుగోపాల్, శివారెడ్డి పోటీ పడ్డారు. వేణుగోపాల్‌ను మిగిలిన డైరెక్టర్లు బలపరిచారు. అయితే శివారెడ్డిని అధ్యక్షుడిగా చేయాలని రాజకీయంగా ఫోన్లలో వత్తిడి రావడంతో సమస్యను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చినట్లు పీఓ వెంకటనారాయణస్వామి నాయక్ తెలిపారు. ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ, పీఓ సమక్షంలో తహసీల్దార్ మారుతి విచారించి, రికార్డు పత్రాలను పరిశీలించారు. వేణుగోపాల్‌తోపాటు డైరెక్టర్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వేణుగోపాల్‌ను బలపరిచారు. దీంతో అధ్యక్షుడుగా వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్ ఎన్నికైనట్లు ప్రకటించారు. శివారెడ్డి పోటీ పడినప్పటికి అతన్ని ఎవరూ బలపరచకపోవడంతో చెల్లదన్నారు.



వాగ్వాదం చేస్తున్న మండ్రోచెరువు సంఘం సభ్యులు

● పులేరు చెరువు సంఘం అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి, నాగరాజు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. జనార్దన్‌రెడ్డిని ఐదుగురు డైరెక్టర్లు బలపరిచారు. నాగరాజు తరపున టీడీపీ నాయకులు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ హంపయ్య, పీఓ మోహన్‌తో గొడవపడ్డారు. ఎన్నిక సరిగా నిర్వహించలేదని, పక్షపాతం చూపుతున్నారని ఘర్షణ పడ్డారు. దీంతో పీఓ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. నాగరాజు అతడి అనుచరులు అక్కడికి చేరుకుని తహసీల్దార్, పీఓలో తీవ్ర వాగ్వాదం చేశారు. పీఓ ఒక వర్గంతో లాలూచీ పడ్డారని, తమకు అన్యాయం జరిగిందంటూ, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ ఇద్దరి రికార్డులు పరిశీలించి, జనార్దన్‌రెడ్డి ఒక్కరే అధ్యక్షస్థానానికి నామినేషన్ వేసినందున ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్లు ప్రకటించారు. ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించనందున ఆస్థానం ఖాళీగా ఉందన్నారు. దీంతో నాగరాజు వర్గీయులు ఘర్షణకు దిగడంతో తహసీల్దార్ ఆదేశం మేరకు ఎస్ఐ బాబు పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని అందరిని తరిమేశారు.

ఆగడాలకు అడ్డుకట్ట...!

పట్టణంలో నాలుగే అప్రూవ్‌డ్ లేఅవుట్లు

రియల్ వ్యాపారుల్లో నిబంధనల టెన్షన్

కదిరిలో రియల్ దందాకు బ్రేక్



పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ వెనుక ఉన్న అక్రమ లే అవుట్‌లో తొలగించిన రోడ్లు (ఫైల్)

కదిరి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పట్టణంలో రియల్ దందాకు బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ల నిబంధనలను కఠినతరం చేయడంతో వ్యాపారుల ఆగడలకు అడ్డుకట్ట పడింది. గత ఆదివారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు, పట్టణ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అక్రమ లేఅవుట్లను అనుమతించేది లేదని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు వేసిన అక్రమ లేవుట్లలో రిజిస్ట్రేషన్లు ఆపివేశారు. దీంతో ప్లాట్లు కొన్న వారు, వారికి అమ్మిన వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

అయితే వచ్చే ఆదివారం గతంలో వేసిన అక్రమ లేఅవుట్ల విషయంలో అనుసరించవలసిన విధివిధానాలు తెలియజేస్తామని చెప్పడంతో రియల్టర్లకు నిబంధనల టెన్షన్ పట్టుకుంది. గత 25 ఏళ్లుగా పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనేక అక్రమ లేఅవుట్లు వేసి ప్లాట్లుగా అమ్మేశారు. వీటిలో కొన్నింటిలో ఇళ్లు నిర్మించుకోగా, మరికొన్ని ఖాళీగా ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వ్యాపారులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో సామాన్య, మధ్యతరగతి వారు ఇళ్లు కట్టుకోవడానికి స్థలం కొనే పరిస్థితి లేకుండా పోయింది. అక్రమ లేఅవుట్‌ల వల్ల మున్సిపాలిటీతో పాటు ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడింది. అక్రమ లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి మున్సిపాలిటీ పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్లాట్లు అమ్మిన వ్యాపారుల్లో టెన్షన్

అక్రమ లేఅవుట్లపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో ప్లాట్లు అమ్మిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో టెన్షన్ మొదలైంది. గతంలో ఇష్టారాజ్యంగా ప్లాట్లు వేసి అమ్మిన లేఅవుట్లను కూటమి ప్రభుత్వం అక్రమ లేఅవుట్లుగా గుర్తించింది. పాట్లలో వేసిన రాళ్లు, ఇతర సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రోడ్లను యంత్రాలతో తొలగించారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ప్లాట్లు కొన్న యజమానులు తమకు డబ్బులు వెనక్కు ఇవ్వాలని అమ్మినవారిని డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో వ్యాపారులు హైరానా పడుతున్నట్లు తెలిసింది. ఎప్పుడో అమ్మిన వాటికి అప్రూవల్ ఎలా తీసుకురావాలి? కోట్ల రూపాయలు మున్సిపాలిటీకి ఎలా కట్టాలని టెన్షన్ పడుతున్నట్లు సమాచారం.



ప్లాట్ల రాళ్లను తొలగించిన అధికారులు(ఫైల్)

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్ వేయాలంటే మొదటగా పట్టణంలో ఉన్న భూమిని వ్యాపార అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలి. దీనికి రెవెన్యూ అధికారులకు డబ్బు చెల్లించాలి. ఆ తరువాత మున్సిపాలిటీ అనుమతి కోసం లేఅవుట్‌లో 33 అడుగుల రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు, మురుగునీటి కాలువలు, ఓపెన్ స్పేస్ వంటివి విధిగా ఉండాలి. అయితే అక్రమ లేవుట్లలో అవేవీ కనిపించవు. పేపర్ల మీద చూపించి ప్లాట్లు అమ్మేశారు. దీంతో ప్రభుత్వం, మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడిందని అధికారులు చెబుతున్నారు.

25 ఏళ్లలో అప్రూవుడ్ లే అవుట్లు నాలుగే

కదిరిలో దాదాపు 22 వేల గృహాలు ఉన్నాయి. అయితే గడచిన 25 ఏళ్లలో కేవలం నాలుగు మాత్రమే అప్రూవుడ్ లేఅవుట్లు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. పట్టణంలో వెలసిన అనేక అక్రమ లేఅవుట్ల వల్ల వీధులన్నీ ఇరుకుగా మారాయి. ఇక్కడ 10 నుంచి 15 అడుగుల రోడ్లు మాత్రమే ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అక్రమ లేఅవుట్లు కావడంతో ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధనదాహమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు రియల్ వ్యాపారులు చేసిన పాపాలను ప్లాట్లు కొన్న యజమానులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిబంధనల కోసం ఎదురుచూపు

అక్రమ లేవుట్లపై తగు నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గత సమావేశంలో చెప్పారు. ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పట్టణాభివృద్ధి జరిగేలా నిబంధనలు అధికారులు రూపొందిస్తారని చెప్పారు. ఈనెల 15న సమావేశం జరగాల్సి ఉండగా మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయం త్వరలో తెలియజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అయితే నిబంధనలు ఏవిధంగా ఉంటాయన్న ఉత్కంఠ వ్యాపారుల్లో ఉంది. ఇప్పటికే వేసిన లేఅవుట్లలో కొన్ని ప్లాట్లు విక్రయించారు. వాటి సంగతి ఏమిటని ప్లాట్లు కొన్న యాజమానులు ఎదురుచూస్తున్నారు. ఎక్కువగా ఉద్యోగులు, ఇతర వ్యాపారులు ప్లాట్లు కొనుగోలు చేశారు. దీంతో వారంతా ఏంటి ఈ పరిస్థితి అని నిట్టూరుస్తున్నారు.

నిబంధనలు రూపొందిస్తున్నాం



పట్టణంలో గతంలో వేసిన అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు విధివిధానాలు రూపొందిస్తున్నాం. త్వరలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు, రియల్టర్లు, రైటర్లు లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తాం. అందులోనే విధివిధానాలు తెలియజేస్తాం.

- కిరణ్‌కుమార్, కమిషనర్

ఘనంగా నారసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితుడు

మడకశిర రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి విగ్రహాలకు ఉదయమే ప్రత్యేక అలంకరణచేసి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో నారసింహుడి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాలో భాగంగా ఆదివారం స్వామి వారి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజా చైతన్యంతోనే తిప్పికొట్టడం సాధ్యం

మానవహక్కుల వేదిక మహాసభల్లో వక్తలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, ప్రజా చైతన్యం ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యమని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) నాయకులు అన్నారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వేదిక 10వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఏపీ మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడారు. కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా పౌర ఉద్యమాలకు పెట్టింది పేరని ఆయన అన్నారు. మానవ హక్కుల వేదిక ఉద్యమంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 2009లో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడో రాష్ట్ర మహాసభల్లో బాలగోపాల్‌తో కలిసి తాను పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. దేశంలో అమలవుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజా చైతన్యంతోనే తిప్పిగొట్టగలమని



మాట్లాడుతున్న మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు గేయానంద్

అన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను పాలకులు నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని ఓపీడీఆర్ నాయకుడు రామ్‌కుమార్ విమర్శించారు. ఆదివాసి సమస్యలపై పోరాడే స్టాలిన్‌ను నిర్బంధించి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల తరపున గొంతెత్తేందుకు పౌరహక్కుల సంఘాలు మరింతగా ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో ప్రజాసంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని హెచ్‌ఆర్‌ఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు భుజంగరావు విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలో ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చేస్తున్నారని అన్నారు. వారి హక్కులను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను ఫేక్ ఎన్‌కౌంటర్ల పేరుతో, ఇతర రూపాల్లోనూ అణచివేస్తున్నారని డెమోక్రటిక్ పీపుల్స్ ఫోరం నాయకుడు శ్రీధర్ అన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, ఎస్ఎం



మహా సభలకు హాజరైన హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధులు

బాషా, అనంతపురం జిల్లా నాయకులు సుబ్బన్న, ఆహ్వాన సంఘం నాయకులు దాదా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కమిటీలు.. తీర్మానాలు

హెచ్‌ఆర్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీలను తొలిరోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాకుళానికి చెందిన జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శిగా అమలాపురానికి చెందిన రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ అధ్యక్షుడిగా ఉట్నూరుకు చెందిన ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా జమ్మికుంటకు చెందిన డాక్టర్ ఎస్ తిరుపతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రాష్ట్రాల నుంచి 144 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న రెండు సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కమిటీల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. నూతన కమిటీల సమక్షంలో 24 అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి - వాక్ స్వాతంత్ర్య హక్కు వర్ధిల్లాలి' అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. మహాసభలలో రెండోరోజు ఆదివారం 'కులగణన ఎందుకు అవసరం' అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, 'కాషాయీకరణ, కార్పొరేటీకరణ' అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారు.

కలుగులో ఎలుకలు బయటికొచ్చాయ్..!



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

వైసీపీ నాయకులకు పరిటాల సునీత చురక

అనంతపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల పాటు కలుగులో దాక్కున్న ఎలుకలన్నీ బయటకొచ్చి కిస్‌కిస్ అంటున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వైసీపీ నేతలను ఎద్దేవా చేశారు. వైసీపీ రైతు పోరుబాటపై శనివారం ఆమె స్పందించారు. రైతుల గురించి మాట్లాడే నైతికత ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. కరువు జిల్లా రైతాంగానికి ఆ పార్టీ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదని మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా రైతులకు రూ.2378 కోట్ల పరిహారం ఇస్తున్నామని ప్రకటించి.. ఎగ్గొట్టలేదా అని జగన్‌ను ప్రశ్నించారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతుంటే అప్పటి ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రశ్నించారా అని నిలదీశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూక్ష్మ సేద్య పథకంతో పండ్లతోటలు విస్తారంగా సాగయ్యాయని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంత మంది రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు ఇచ్చారో చెప్పే ధైర్యం వైసీపీ నాయకులకు ఉందా అని సవాలు విసిరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అన్ని వర్గాలకు మంచి చేయాలనే యోచనలో ముందుకు వెళుతోందని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేనందున కూటమి ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆరు నెలలుగా కనిపించని వైసీపీ నాయకులంతా ఇప్పుడు బయటికొచ్చి రైతులపై కపటప్రేమ ప్రదర్శిస్తున్నారని, జిల్లా రైతాంగం వారిని నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

రైల్వే డివిజన్‌కు జాతీయ పురస్కారాలు

ఇంధన పరిరక్షణకు వరించిన అవార్డులు



అవార్డును అందుకుంటున్న డీఆర్ఎం విజయ కుమార్

గుంతకల్లు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు రెండు జాతీయ ఇంధన పరిరక్షణ పురస్కారాలు లభించాయి. భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి, రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఇంధన పరిరక్షణలో ప్రథమ బహుమతి లభించింది. ఢిల్లీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ నుంచి డివిజన్ అవార్డులను డీఆర్ఎం విజయకుమార్ స్వీకరించారు. గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో గ్రిడ్, జనరేటర్ల ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్తు కారణంగా 2021-22లో 2.27 లక్షల యూనిట్ల కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని 2022-23 సంవత్సరంలో 1.85 లక్షల యూనిట్లకు, 2024-25 నాటికి 0.96 లక్షల యూనిట్లకు తగ్గించారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఇలాగే 7.17 లక్షల యూనిట్ల వినియోగం నుంచి 2.73 లక్షల యూనిట్లకు కొనుగోలు విద్యుత్ వినియోగాన్ని తగ్గించారు. ఈ కారణంగా డివిజన్‌కు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు లభించాయి.

కలిసి ఉండండి

దంపతులను కలిపిన న్యాయాధికారి



దంపతులు ఒక్కటైనట్లు పత్రం అందిస్తున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అన్యోన్యంగా ఉన్న దంపతులు మనస్పర్థలతో రెండేళ్ల నుంచి విడిగా ఉంటూ విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు. కానీ న్యాయాధికారి కౌన్సెలింగ్‌తో ఆ దంపతులు ఒక్కటయ్యారు. ఈ సంఘటన హిందూపురంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో చోటుచేసుకుంది. హిందూపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, నారాయణలకు 2018లో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రెండేళ్ల నుంచి భార్య కాపురానికి రాకపోవడంతో నారాయణ విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు. ఈ పరిస్థితుల్లో లోక్‌అదాలత్‌కు వారిద్దరిని పిలిపించి అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ కౌన్సెలింగ్ ఇచ్చారు. న్యాయాధికారి చెప్పిన మాటలు విని ఇద్దరు కలిసి ఉండటానికి ఒప్పుకున్నారు. దీంతో ఆమె వెంట వచ్చిన కుమారులు ఇద్దరు ఎంతో సంతోషంగా తండ్రి వద్దకు వెళ్లారు. ఇది చూసిన న్యాయాధికారి కంపల్లె శైలజతోపాటు మరో న్యాయాధికారి, న్యాయవాదులు వారిని అభినందించి ఒక్కటైనట్లు పత్రం అందజేసి పంపించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

కదిరి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని మలకవారిపల్లి గ్రామానికి చెందిన తిప్పమ్మ (68) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన మేరకు మలకవారిపల్లికి చెందిన తిప్పమ్మ తన కుమారై సమాధి వద్ద ముళ్లచెట్లు పెరగడంతో వాటిని తొలగించడానికి వెళ్లారు. అయితే సమాధి పక్కనే పడి ఉన్న విద్యుత్ తీగను గమనించలేదు. విద్యుత్ సరఫరా అవుతున్న ఆ తీగను తాకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ వెంకటనారాయణ శవాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు బైరారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.



తిప్పమ్మ (ఫైల్)

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర మైనార్టీ అఫైర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మైనార్టీ అఫైర్ ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకొచ్చిన ఆయన రోడ్లు, భవనాల అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు, మైనార్టీ వసతిగృహాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. మైనార్టీల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆ పథకాలకు అర్హులైన వారికి లబ్ధి అందజేసేందుకు ప్రతి ఒక్క అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ ఉమ్మడి జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

అనంతరం జడ్పీలోని డీఆర్‌సీ సమావేశపు హాల్‌లో జిల్లాలోని ముస్లిం మైనార్టీ సంఘాలు, ఖాజీలు, పెద్దలు, క్రిస్టియన్ మైనార్టీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వారికందాల్సిన సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించి మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఆయా కార్యక్రమాల్లో మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీం, క్రిస్టియన్ మైనార్టీ డీపీఎం మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్లు సాలార్ బాష, గౌస్‌మొద్దీన్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

గార్లదిన్నె: మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి



షరీఫ్‌ను సన్మానిస్తున్న ఆల్‌మేవా నాయకులు

కృషి చేస్తామని ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. గార్లదిన్నెలోని మైనార్టీ గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లోని గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనం షరీఫ్

అనంతపురం క్లాక్‌టవర్: నిజాయతీ, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం ఎంఏ షరీఫ్ అని ఆల్‌మేవా నాయకులు కొనియాడారు. జిల్లాకు వచ్చిన ఎంఏ షరీఫ్‌ను శనివారం స్థానిక జిల్లా పరిషత్తు ఆవరణంలోని డీఆర్‌సీ భవనంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆల్‌మేవా నాయకులు మాట్లాడుతూ షరీఫ్ సేవలను గుర్తించి ప్రభుత్వ మైనార్టీ సలహదారులుగా నియమించడం పట్ల సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌మేవా నాయకులు ఫక్రుద్దీన్, షెక్షావలీ, ఫరూఖ్, మహ్మద్‌దౌలా, జిలాన్, అన్వర్, అష్రాఫ్, ఆలీబాబా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,235 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6235 కేసులకు పరిష్కారం చూపినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 25 బెంచులు ద్వారా 5753 క్రిమినల్, 151 సివిల్, 66 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. ప్రమాద భరిత కేసులలో కక్షిదారులకు రూ.56750000, సివిల్ కేసులలో రూ.3196134, ప్రీలిటిగేషన్ కేసులలో రూ.12184731 చొప్పున పరిహారం ఇప్పించినట్లు వివరించారు. కక్షిదారులు, పిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో పెద్దఎత్తున పరిష్కారాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.



రాజీపత్రాన్ని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు, ఎస్పీ జగదీష్

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు

జిల్లా క్రీడాకారుల ఎంపిక



సంతోష్, ఉజ్వలేశ్వర్ సాయి, జీవన్

అనంతపురం క్లాక్ టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించే 49వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్- 2024 పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా క్రీడాకారులు సంతోష్, ఉజ్వలేశ్వర్ సాయి, జీవన్‌లు ఏపీ రాష్ట్రం తరపున జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్ర నేల వీధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అంజలి అనే మహిళ ఇంటిని సోదా చేశారు. 384 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ హసీనాబాను తెలిపారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

విస్తరిస్తున్న పొగాకు సాగు



- ఆసక్తి చూపుతున్న రైతులు
- రెండు మండలాల్లో 150 ఎకరాల్లో సాగు
- ప్రోత్సహిస్తున్న ప్రైవేట్ కంపెనీ

తాడిపత్రి నియోజకవర్గంలో గత రెండు మూడేళ్ల నుంచి పొగాకు సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. పుట్లూరు, యల్లనూరు మండలాల పరిధిలోని నల్లరేగడి భూముల్లో ఉద్యాన పంటలతోపాటు పొగాకు పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ ప్రాంతంలో సాగు చేయకపోయినా, కొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి పొగాకు పంటను సాగు చేస్తున్నారు. పొగాకు పంటకు మార్కెట్‌లో డిమాండ్, ధర బాగా ఉండటంతో కొందరు రైతులు సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటితోనే ఆశించినస్థాయిలో దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఓ ప్రైవేట్ కంపెనీ ముందుగానే ఒప్పందం చేసుకుని, పొగాకు పంటను కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. యల్లనూరు మండలంలోని వేములపల్లి, గిర్రమ్మబావి, పీఎం కొండాపురం, పుట్లూరు మండలంలోని శనగలగూడూరు, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 150ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, పుట్లూరు/యల్లనూరు

రాజమండ్రి ప్రాంతం నుంచి మొక్కలు తెచ్చి..

రాజమండ్రి ప్రాంతంలోని నర్సరీల నుంచి ఇక్కడికి పొగాకు మొక్కలను తెస్తున్నారు. ఆ మొక్కలను నాణ్యతను బట్టి 30పైసల నుంచి అర్ధ రూపాయి వరకు రైతులకు నర్సరీల నిర్వాహకులు విక్రయిస్తారు. సాగు చేసిన నాలుగునెలలు తర్వాత ఏపుగా పెరిగినా పంటను కోస్తారు. ముందుగా 70-80రోజుల మధ్యన ఈ ఆకు పండువారి రాలుతుంది. తర్వాత రైతులు ఆ పంటను కోసి 20రోజులపాటు ఎండబెడతారు. ఎండబెట్టిన అనంతరం కంపెనీ ఇచ్చిన బోరా సంచుల్లో వేసి బనగానపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీకి ట్రాన్స్‌పోర్టు చేస్తారు.

తక్కువ పెట్టుబడి

పొగాకు పంటను తక్కువ పెట్టుబడితో సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. ఈ పంటకు నీటి తడులు కూడా అంతంత మాత్రంగా ఉన్నా సరిపోతుంది. ఎకరా పొగాకు పంటకు సుమారు రూ.50 వేలు నుంచి రూ.80వేలు పెట్టుబడి అవుతుంది. కొందరు రైతులు పంట పరిస్థితిని బట్టి డ్రిప్పు సాయంతో నీరు పెడుతున్నా రు. ఎకరాకు సుమారు 12నుంచి 18క్వింటాళ్లవరకు దిగుబడి వస్తుంది. వీటికి ఎలాంటి తెగుళ్లు సోకవు. మందులు కూడా పిచికారీ చేయాల్సిన అవసరం లేదని రైతులు చెబుతున్నారు. బోర్లలో నీరు తక్కువ ఉన్న రైతులు పొగాకు పంటపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

క్వింటానికి రూ.15వేల ప్రకారం ..

పండించిన పొగాకు పంటను నంద్యాల జిల్లా బనగానపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీ ముందుగానే కుదుర్చుకున్న ఒప్పందం మేరకు కొనుగోలు చేస్తుంది. రైతులు పంట సాగు సమయంలోనే క్వింటా రూ.15వేలు చొప్పున కంపెనీతో మాట్లాడుకొని వచ్చి, పంట పండిన తర్వాత మొత్తం దిగుబడిని బనగానపల్లికి సరఫరా చేస్తారు. రవాణా ఖర్చులకు సైతం క్వింటాకు రూ.100నుంచి రూ.500లోపు కంపెనీనే ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. విక్రయించిన పంట డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లోకే మరుసటి రోజే జమ చేస్తున్నారు. కంపెనీ ప్రతినిధులు పంట కాలంలో కూడా రైతుల వద్దకు తోటను పరిశీలిస్తుంటారు. రైతులకు పంటపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తుంటారు. పొగాకు పంట సాగు చేయాలనుకునే రైతులు ఎవరైనా ఉంటే కంపెనీ ప్రతినిధులే నేరుగా వచ్చి వారిని కలుస్తుంటారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



నేను మూడేళ్ల నుంచి 20 ఎకరాల్లో పొగాకు పంటను సాగుచేస్తున్నా. పంట లాభదాయకంగా ఉంది. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ప్రభు త్వం కొంత మేర ప్రోత్సాహం అందిస్తే బాగుంటుంది. ఈ పంట గురించి విషయాలు తెలియని రైతులకు వివరిస్తే ఇంకా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఈ రెండు మండలాల్లో భూగర్భజలాలు అంతంతమాత్రంగానే ఉన్నా పొగాకు సాగుకు సమస్య ఉండదు. ఒక ఇంచు నీరు వచ్చే బోరు ఉన్నా సుమారు ఐదెకరాలకుపైగా పొగాకు పంటను సాగు చేయవచ్చు.

- ప్రకాష్‌నాయుడు, వేములపల్లి

పేక.. ముక్క..!

చిలమకూరు తిరుణాలలో జూదం

పోలీసుల అనుమతితోనే నిర్వహణ..?

యల్లనూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుణాలలో దుకాణాలను ఏర్పాటు చేయడం సహజం. పోలీసుల కళ్లుగప్పి.. కొందరు మద్యం సేవించడం, పేకాట ఆడటం కూడా పరిపాటి. కానీ, వేడుక జరిగే ప్రాంతానికి కాస్త దూరంగా, మరుగున ఇలాంటి పనులు చేస్తుంటారు. విషయం తెలిస్తే.. పోలీసులు చర్యలు తీసుకుంటారు. కానీ చిలమకూరు ఆంజనేయ స్వామి తిరుణాలలో వ్యవహారం శృతిమించింది. ఏకంగా స్వామివారి ఆలయం పక్కనే పేక.. ముక్క ఆడించారు. పోలీసులు అడిగితే.. 'సార్ అనుమతి తీసుకున్నాం కదా..?' అని ఎదురు ప్రశ్న వేశారు. దీంతో పోలీసు సిబ్బంది అవాక్కయ్యారు. యల్లనూరు మండలం చిలమకూరులో ఏటా ఆంజనేయస్వామి తిరుణాల నిర్వహిస్తారు. ఈ ఏడాది శుక్ర, శనివారాలలో వేడుక ఘనంగా జరిగింది. ఎప్పటిలాగానే గాజులు, బొమ్మలు, తినుబండారాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి పేక.. ముక్క (అందర్.. బాహర్) ఆడించారు. శుక్రవారం రాత్రి అంతా ఆట కొనసాగింది. వేలాది రూపాయలు చేతులు మారాయి. ఇంతకూ వీరికి ఏ సారు అనుమతి ఇచ్చారో తెలియదు. 'సార్ అనుమతి ఇచ్చారు కదా..?'



ఆలయం వద్ద బహిరంగంగా జూదం

అని అనగానే బందోబస్తుకు వెళ్లిన సర్కిల్ పోలీసులు నివ్వెరపోయారు. చర్యలు తీసుకోవాలో.. వదిలేయాలో తెలియక బుర్ర గోక్కున్నారు.

ఆటలో మైనర్‌లు

పేక.. ముక్క ఆటలో పెద్దలతోపాటు మైనర్లు కూడా పాల్గొన్నారు. యువకులతోపాటు పన్నెండేళ్ల బాలుడు పందెం కాస్తూ కనిపించాడు. తిరుణాలకు వచ్చిన భక్తులు ఈ జూదాన్ని చూసి నివ్వెరపోయారు. చదువుకోవాల్సిన పిల్లలను ఇలా తప్పుదారి పట్టిస్తే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ తమ గ్రామంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. జూదానికి పోలీసులు నిజంగానే అనుమతులు ఇచ్చారా అనే చర్చ జరుగుతోంది. ఇంత బహిరంగంగా జూదం ఆడుతున్నా పోలీసులు పట్టించుకోలేదంటే.. అనుమతి ఇచ్చే ఉంటారని అంటున్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ. 10

అనంతపురం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 32వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32,150 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 15 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 782 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 615 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.678 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆఫీస్ ఆటోమేషన్, క్రాఫ్ట్, బ్యూటీషియన్ కోర్సులకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్, ఆపై అర్హత ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మార్చి లేదా ఏప్రిల్ 2025లో అనంతపురం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. వివరాలకు కమలానగర్‌లోని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలోకానీ, సెల్ నెంబర్లు 9059723829, 7569033379 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

జయప్రదం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని జయప్రదం చేయాలని ఆ శాఖ డీడీ కుష్బూకొఠారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవనంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 20 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఎక్సైజ్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. పైతోట సమీపంలో మారెమ్మ గుడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు కారులో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. పైతోట గ్రామానికి చెందిన ఎస్ హనుమంతు, రేకులకుంట గ్రామానికి చెందిన వరప్రసాద్, వేపరాల గ్రామానికి చెందిన లింగప్పలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కారు, 20 బాక్సుల మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

చోరీకి యత్నం

అనంతపురం క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి బైపాస్‌రోడ్డు సమీపంలోని రిలయన్స్ డిజిటల్ షాప్‌లో దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని దుండగులు షాప్‌లోకి చొరబడే యత్నం చేశారు. అక్కడున్న అలారం మోగడంతో పారిపోయారు. మేనేజర్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధిస్తున్నారు..

శింగనమల మండలంలో తమను వేధిస్తున్నారని రాజశేఖర్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలో అధికారులకు ఫిర్యాదు చేయడానికి వచ్చి మీడియాతో వారు మాట్లాడారు. చిన్నజలాలపురంలో ఎస్సీలపై దురాగతాలు ఏమాత్రం ఆగడం లేదన్నారు. గ్రామంలో పెద్దల సూచనల మేరకు ఆలయానికి చెందిన భూమిలో 70మంది గృహాలు నిర్మించుకుంటుంటే, ఎవరికీ లేని అభ్యంతరం తమకుందని కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ గ్రామ పెద్దల సూచనల మేరకు షెడ్డు వేసుకున్నందుకు దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు.

రేపు ఇస్కాన్‌లో గీతాజయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో సోమవారం గీతాజయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర చైర్మన్ దామోదర గౌరంగదాస్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా 1008 మంది విద్యార్థులతో సామూహిక భగవద్గీత పారాయణం చేయనున్నట్లు తెలిపారు. పారాయణంలో పాల్గొనే విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.

శభాష్ రాముడు ..!

- గొర్రెల పెంపకంలో మేటి
- శాస్త్రీయ పద్ధతి అనుసరణ
- నాటు వైద్యానికి చెక్...
- లాభాలు గడిస్తున్న యువరైతు



గొర్రెల పెంపకం కోసం ఏర్పాటు చేసిన షెడ్



గొర్రెల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశం

స్ఫూర్తి

శింగనమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాసై ఇంటికి వచ్చాడు. తాతల కాలం నుంచి వ్యవసాయంలో అవే నష్టాలు ఆవే బాధలు. పనికి వచ్చే కూలీలను గమనించాడు. ఇలాగే కొనసాగితే వ్యవసాయం బరువు అని గ్రహించాడు. తాను కూడా వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. పైతరగతులకు వెళ్లాలని పెద్దలు చెప్పినా వ్యవసాయమే చేస్తా అన్నాడు. అందరితో కలసి తోటలకు వెళ్లేవాడు. పంటలు చేతికి వచ్చినా కూలీలకు సరిపోయేది. ఇన్ని రోజుల కష్టానికి ఫలితం ఇంతేనా అనుకున్నాడు. వ్యవసాయానికి అనుబంధంగా ఏమైనా చేయాలని భావించాడు. అలా తన ఆలోచన గొర్రెల పెంపకం వైపు మళ్లింది. గొర్రెల పెంపకందారుల వద్దకు వెళ్లి చూశాడు. వాళ్లు పాత పద్ధతులే అనుసరిస్తున్నారు. వంద గొర్రెలు తీసుకొచ్చి అప్పటికే తమ వద్ద ఉన్న పనివారితో కలిసి పెంపకం మొదలు పెట్టాడు. పాత పద్ధతులతోనే పెంచడం ద్వారా ఆశించిన ఫలితాలు రాలేదు. సొంత స్థలంలోకి వచ్చి శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెలు పెంపకంతో ఏడాదికి రూ.లక్షలు గడిస్తున్నాడు పెరవలి గ్రామానికి చెందిన యువ రైతు పుచ్చకాయల రామునాయుడు.

షెడ్లలో గొర్రెల పెంపకం

అప్పటి వరకు గొర్రెల కాపరులు పగలు పొలాల్లోకి మేతకు వెళ్లి.. రాత్రిళ్లు ఒక పొలంలో నిలుపుకునేవారు. తద్వారా గొర్రెలకు కొన్ని వ్యాధులు వచ్చేవి. ఈ వ్యాధులు ఎందుకు వస్తున్నాయని డాక్టర్లను సంప్రదించాడు. గొర్రెలు నేల మీద పడుకోవడం వల్ల వాటి మలమూత్రాలతో కొన్ని వ్యాధులు సంక్రమిస్తున్నాయని చెప్పారు. దీంతో రూ. లక్ష పైగా ఖర్చు చేసి పెద్ద షెడ్ ఏర్పాటు చేశాడు. గొర్రెలు షెడ్డులో పడుకుంటే వాటి మూలమూత్రాలు కిందికి వచ్చేలా చక్కలతో పరుపు ఏర్పాటు చేశాడు. తద్వారా గొర్రెలకు వ్యాధులు తగ్గడంతో పాటు వాటి ఎరువు కూడా ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. గొర్రెలకు వ్యాధులు వస్తే ఎక్కువ శాతం కాపరులు నాటు వైద్యం చేసేవారు. ఈయన గొర్రెకానీ.. పిల్లకానీ చనిపోతే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి కారణాలు తెలుసుకుంటాడు. వారి సలహా మేరకు మందులు వాడతాడు. తనకున్న అనుభవంతో చాలా వరకు సొంతంగా వైద్యం చేస్తాడు.

కోళ్ల పెంపకం

గొర్రెలకు అనుబంధంగా కోళ్ల పెంపకం కూడా చేపట్టాడు. సాధారణంగా షెడ్డు కింద ఉన్న గొర్రెల ఎరువులో పురుగులు, పిడుదులు ఉంటాయి. కోళ్లు ఉండటం వల్ల వాటిని తింటాయి. ఎరువు శుభ్రంగా ఉండటంతో ధర కూడా ఎక్కువగానే పలుకుతుంది. కోళ్ల ద్వారా అదనంగా గుడ్లతో పాటు ఆదాయం వస్తోంది.

ఐదేళ్లలో వెయ్యి గొర్రెలు

2015లో వంద గొర్రెలతో పెంపకం మొదలు పెట్టాడు. 2016లో మరో వంద తీసుకొచ్చాడు. వీటిని కాసేందుకు సంవత్సరం వేతనం ఒప్పందంతో ఇద్దరు కూలీలను ఏర్పాటు చేసుకున్నాడు. 2020 నాటికి వెయ్యి గొర్రెల పైగా అయ్యాయి. వాటి సంరక్షణకు మరో ఇద్దరు కూలీలను ఏర్పాటు చేశాడు. ప్రతి సంవత్సరం లక్షల్లో ఆదాయం గడించాడు. వంద గొర్రెలు పెంచడానికి ఇద్దరు కూలీలు కావాలి. వీరికి నెలకు రూ.10వేలు చొప్పున ఇద్దరికి సంవత్సరానికి రూ.2.40 లక్షలు అవుతుంది. దీంతోపాటు గడ్డి మందులు, ఇతర ఖర్చులు మరో రూ.1.50 లక్షలు అవుతుంది. వంద గొర్రెలు పెంచితే సంవత్సరానికి రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షలు వరకు ఆదాయం వస్తోంది. యువరైతుకు వెయ్యి గొర్రెల పంపకంతో సంవత్సరానికి రూ.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ప్రతి వంద గొర్రెలకు 5 విత్తన పొట్టేళ్లు ఉండాలి. వీటిలో దాదాపు 80 గొర్రెలు రెండేళ్లలో మూడు ఈతలు ఇస్తాయి. రెండు సంవత్సరాల్లో ఇంచు మించు 240 నుంచి 250 గొర్రె పిల్లలు అవుతాయి. వీటిలో పొట్టేలు పిల్లలు దాదాపు సగం అనుకున్నా 125 అవుతాయి. ఒక్కో పిల్ల రూ.6 వేల నుంచి రూ.7 వేలు ధర పలుకుతాయి. ఈ లెక్కన కనీసం రూ.7.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. బ్రుకురాయసముద్రం కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు చాలా ఉపయోగపడ్డాయని రైతు తెలిపాడు.

పాత పద్ధతులు మానుకోవాలి



రైతు అభివృద్ధి చెందాలి. రైతు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. రైతులు కూడా పాత పద్ధతులను మార్చుకోవాలి. కాలానికి అనుగుణంగా మారుతున్న వ్యవసాయ విధానాలతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి. గొర్రెల పెంపకానికి మా కుటుంబం కూడా తోడ్పాటు అందించింది. గొర్రెల పెంపకంతో లాభాలు రావడంతో వ్యవసాయంపై కూడా దృష్టి సారించాను.

\- పుచ్చకాయల రామునాయుడు

ఆసక్తికరంగా రూరల్ క్రికెట్ లీగ్



రివ్య



గీతిక



గౌతమి



హిమవర్షిణి



హాన్సిరెడ్డి



కౌశిక్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలుర అండర్-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్, తపోవనం క్రికెట్ అకాడమీ జట్లు తలపడగా 30 ఓవర్లలో ఎస్ఎస్‌బీఎన్ 2వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. సుమియాతేజ్ 72, గౌతమి 82పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన టీసీఏ కేవలం 22 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 209పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. గీతిక 80, హిమవర్షిణి 82పరుగులు చేశారు. మరో మ్యాచ్‌లో కదిరి, అనంత స్పోర్ట్ అకాడమీ జట్లు తలపడగా ఏఎస్ఏ నిర్ణీత 30ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 295పరుగులు చేసింది. బ్యాటర్లు హాన్సిరెడ్డి 19, రివ్య 105పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కదిరి 30ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 136పరుగులు మాత్రమే చేసింది. ఇందులో నిత్యారెడ్డి 92పరుగులు చేసి వికెట్లు పడకుండా కాపాడుకుంది. దీంతో ఏఎస్ఏ 159భారీ పరుగుల తేడాతో విజయం నమోదు చేసింది. బాలుర పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, పీటీసీ జట్లు తలపడగా...టీసీఏ 40ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 234పరుగులు చేసింది. కౌశిక్ 130పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన పీటీసీ 40ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 179పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఏసీఏ 55పరుగుల తేడాతో గెలుపొందింది.

అందరికీ దేవుడు ఒక్కడే

మత పెద్దలు, వక్తలు



సర్వమత సమ్మేళనంలో ఐక్యత చాటుతున్న మతపెద్దలు, కవులు

పెనుకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కులాలు, మతాలు వేరైనా, పూజించే దేవతల రూపాలు వేరైనా అందరికీ దేవుడు ఒక్కడేనని వివిధ మతాలకు చెందిన మతపెద్దలు, వక్తలు పేర్కొన్నారు. బాబయ్యస్వామి 752 గంధం మహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సందల్‌మహల్‌వద్ద శుక్రవారం రాత్రి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా అధ్యక్షతన ఖవాలీ మహల్‌వద్ద సర్వమత సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ సలహాదారుడు షరీఫ్‌అహ్మద్, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, వివిధ మతాలకు చెందిన కవులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజ్ బాబా మాట్లాడుతూ జాతి సమైక్యత ప్రపంచ శాంతి కోసం తుదిశ్వాస వరకు కృషి చేస్తానన్నారు. షరీఫ్‌అహ్మద్ మాట్లాడుతూ భారతదేశంలోనే ఏ దర్గాలోనూ ఇలాంటి గొప్ప కార్యక్రమం నిర్వహించడం లేదని, పెనుకొండ దర్గాలో 35ఏళ్లుగా జాతీయ సమైక్యత కార్యక్రమం నిర్వహిస్తున్న తాజ్ బాబా అభినందనీయుడన్నారు. గజల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కుల మతాలకు, జాతి, మత బేధాలకు అతీతంగా అందరూ ఐక్యతతో కలిసి పనిచేయాలన్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 30మందిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘం అధ్యక్షులు చాంద్‌బాషా, జాన్‌ప్రియనాథ్, ఉమర్‌ఫారూక్, రవిశంకర్‌గురూజీ, జత్సేత్‌సింగ్, బ్రహ్మకుమారి సుగంధి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంధం మహోత్సవం

పెనుకొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్యస్వామి 752వ గంధం మహోత్సవాలు శనివారం తెల్లవారుజామున ఘనంగా ముగిశాయి. తెల్లవారుజామున 3.30గంటలకు దర్గా వంశ పారంపర్య పీఠాధిపతి తాజ్‌బాబా సందల్‌మహల్ నుంచి గంధాన్ని తలపై పళ్లెంలో ఉంచుకుని బాబయ్య దర్గా వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి సమాధివద్ద సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామిని పూజించిన గంధం కోసం భక్తులు ఎగబడ్డారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

రచయిత్రి ఉమాదేవికి సాహితీవేత్తల నివాళి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పరిశోధన గ్రంథ రచయిత్రి చెట్ల ఉమాదేవికి అనంత సాహితీవేత్తలు నివాళులర్పించారు. ఉమాదేవి 13వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరసం ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర మాట్లాడుతూ జిల్లా రైతాంగ సమస్యలపై రచయిత్రి ఉమాదేవి రచించిన 'అనంత కరువు - ఇనుప గజ్జెల తల్లి' గ్రంథాన్ని 2003-04 సంవత్సరంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుకుటుంబాలకు అంకితం చేశారని గుర్తుచేశారు. ఆమె సాహిత్య సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, పూజారి ఈరన్న, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, కవులు రియాజుద్దీన్, విశ్వనాథరెడ్డి, పరమేశ్వరరావు, బాలయ్య, సుబ్బరాయుడు, విశాలాంధ్ర బుక్‌హౌస్ విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న, ప్రవీణ్‌కుమార్, విశాలాంధ్ర సిబ్బంది పాటిల్ హరీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఉమాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

లక్షాధికారులను చేయడమే లక్ష్యం: పీడీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి స్వయం సహాయక సంఘం మహిళను లక్షాధికారిని చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య అన్నారు. శనివారం స్థానిక బుడ్డప్పనగర్‌లోని ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో స్త్రీనిధి 18వ మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలను సంస్థాగతంగా బలోపేతం చేయడమే కాకుండా కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలతో జీవనోపాధుల ఏర్పాటు చేసుకుని ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. అదేవిధంగా తీసుకున్న రుణాలకు సంబంధించి మొండి బకాయిల వసూళ్లపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రాజధాని అమరావతి నుంచి నిర్వహించి స్త్రీనిధి రాష్ట్రస్థాయి మహాజనసభ నుంచి సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి, సీఈఓ వీర పాండ్యన్, స్త్రీనిధి ఎండి హరిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సమావేశంలో స్త్రీనిధి జిల్లా ఏజీఎం హనుమేష్‌బాబు, 31 మండలాల సమాఖ్యల అధ్యక్షులు, స్త్రీనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య



మృతి చెందిన పురంధర్

రాయదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నివాసం ఉంటున్న ఓ ఉపాధ్యాయుడు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డీ.హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన పురంధర్(42) రాయదుర్గం మండలంలోని టీ వీరాపురం హైస్కూల్‌లో హిందీపండిట్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై విధులకు హాజరు కాకుండా దీర్ఘకాలిక సెలవులో ఉంటున్నాడు. ఇతడి ప్రవర్తనతో విసిగిపోయిన భార్య విడాకులిచ్చి, కుమారుడితో కలిసి పట్టణంలోనే ఉంటోంది. దీంతో పురంధర్ ఒంటరిగా రాయదుర్గంలోనే గ్యాస్‌గోడౌన్ వద్ద నివాసం ఉంటున్నాడు. అయినవారందరూ దూరంగా ఉంటుండటంతో మానసికంగా కృంగిపోయాడు. ఈ నేపథ్యంలో శనివారం రైల్వేస్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపు వెళ్లే వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై కట్టెలతో దాడి

అన్నతో గొడవపడి.. తమ్ముడిపై దాడి



గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ పురుషోత్తం

ధర్మవరంరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ తిరువీధుల పురుషోత్తంపై అదేగ్రామానికి చెందిన వనం లక్ష్మీ నారాయణ, అతడి కుటుంబసభ్యులు శనివారం కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితు డు తెలిపిన మేరకు తన అన్న తిరువీధుల దేవేంద్రకు, వనం లక్ష్మీనారాయణకు మధ్య పొలాల వద్ద కొన్నాళ్లుగా రస్తా వివాదం జరుగుతోంది. అయితే శనివారం ఉదయం వనం లక్ష్మీనారాయణ తన అన్న దేవేంద్ర ఇంటివద్దకు వచ్చి రస్తా వివాదంపై గొడవకు దిగి వెళ్లిపోయాడన్నారు. గంట తర్వాత వనం లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు విజయ్‌కుమార్, నరేష్ మరికొందరితో కలిసి తన ఇంటి వద్దకు వచ్చారన్నారు. వచ్చిరాగానే అక్కడ ఉన్న కట్టెలను తీసుకుని ఇంటిబయట ఫీల్డ్‌వర్క్ మస్టర్లను చూసుకుంటున్న తనపై దాడి చేశారన్నారు. ఇంటిలోని కుర్చీలు, సామాన్లు కూడా పగలగొట్టారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిన్ను, మీ అన్నను చంపుతాం అంటూ బెదిరించి వెళ్లిపోయినట్లు పేర్కొన్నాడు. ఈ దాడిలో పురుషోత్తం తలకు తీవ్రమైన గాయం కావడంతో కుటుంబసభ్యులు హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఎలుగుబంటి మృతి



ఎలుగు బంటికి పంచనామా చేస్తున్న పశువైద్యులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ వంక గొల్లలదొడ్డి గ్రామ సమీపంలో విద్యుతాఘాతంతో ఎలుగుబంటి మృతి చెందింది. గ్రామస్థులు ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. ఫారెస్ట్ అధికారి విఘ్నేష్ అప్పావుతోపాటు రేంజ్ అధికారి మధుబాబు, డీఆర్వో దామోదర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై గ్రామస్థులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మహిళ ఆత్మహత్య



సువర్ణమ్మ (ఫైల్)

రాయదుర్గం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ వీరాపురం గ్రామానికి చెందిన సువర్ణమ్మ(36) శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ బాలరాజు తెలిపారు. సువర్ణమ్మను కణేకల్లుకు చెందిన శ్రీరాములు 18 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోనే ఓ కిరాణా కొట్టు పెట్టుకుని ఆమె జీవనం సాగిస్తోంది. అయితే తన కుమారుడు హనుమంతరాయుడుతో వివాహేతర సంబంధం పెట్టుకుందని అతడి తల్లి ఎర్రమ్మ, భార్య గంగమ్మ, మరదలు అశ్విని శుక్రవారం సాయంత్రం కొట్టు వద్దకు వచ్చి సువర్ణమ్మతో గొడవకు దిగారు. దీంతో మనస్థాపానికి గురైన సువర్ణమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగునీటి సంఘాలన్నీ ఏకగ్రీవం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిర్వహించిన 15 సాగునీటి సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆయా సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో టీడీపీ మద్దతుదారులు నామినేషన్లు మాత్రమే వేయడంతో ఎన్నికల అధికారులు 15 సాగునీటి సంఘాలకు సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యాక్ష, డైరక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి వారికి డిక్లరేకషన్ ఫారాలు అందచేశారు. వెంగళమ్మచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మత్తే వెంకటరాముడు, ఉపాధ్యక్షులుగా ఆవుల లక్ష్మీనారాయణ, ఎనుమలపల్లికి అధ్యక్ష ఉపాధ్యక్షులుగా సుధాకర్, గంగిరెడ్డి, బీడుపల్లి అధ్యక్ష ఉపాధ్యక్షులుగా రాంమోహన్, గంగాద్రి, జగరాజుపల్లి అధ్యక్ష ఉపాధ్యక్షులుగా గోరెడ్డిగారి లక్ష్మి, స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవమైన 15 సాగునీటి సంఘాల సభ్యులను ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపొందినవారికి ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో అభినందనసభ ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతం



చింతలపల్లిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ధర్మవరం చెరువుతో పాటు మండలంలోని గొట్లూరు, చింతలపల్లి, పోతుకుంట, రావులచెరువు, రేగాటిపల్లి, సీసీ కొత్తకోట, కుణుతూరు చెరువులకు నిర్వహించిన ఎన్నికలలో 7టీడీపీ మద్దతుదారులు, 1జనసేన(రేగాటిపల్లి) మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మవరం చెరువుకు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, లక్ష్మీదేవి, గొట్లూరు చెరువుకు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా సంటెన్న, నారాయణ, రేగాటిపల్లి చెరువు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా కొండారెడ్డి, సాంబశివారెడ్డి, చింతలపల్లి చెరువు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా పెద్దకాటమయ్య, తిప్పానాయుడు, పోతుకుంట చెరువు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా లక్ష్మన్న, నారాయణ, రావులచెరువు చెరువు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా లక్ష్మీరెడ్డి, సాకే రాజమ్మ, సీసీ కొత్తకోట చెరువు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా నారపరెడ్డి, పెద్దిరెడ్డి, కట్టకింద పల్లి చెరువు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, నారాయణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



నల్లచెరువు: పంతులచెరువు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నారాయణ, నరసింహులు



ఓబుళదేవరచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన జయన్నను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



తాడిమర్రి: అగ్రహారం సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు నారాయణమ్మ, నాగయ్యలతో టీడీపీ నాయకులు



నంబులపూలకుంట: ధనియాన్‌చెరువు అధ్యక్షులు గోవిందమ్మకు డిక్లరేషన్ ఫారం అందచేస్తున్న అధికారులు



గాండ్లపెంట: పొరెడ్డివారిపల్లి అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామిరెడ్డి, హైదర్‌వలికి డిక్లరేషన్ ఫారం ఇస్తున్న అధికారులు



బత్తలపల్లిలో డిక్లరేషన్‌పత్రాలు అందుకుంటున్న అధ్యక్ష కార్యదర్శులు



తనకల్లు: సీజీపీ ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు మోహన్, నారాయణరెడ్డి



బుక్కపట్నం చెరువు అధ్యక్షుడు నవీన్‌కుమార్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఈఓ

విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి

నంబులపూలకుంట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్ చెరువు పాతూరుకు చెందిన సాలెమ్మ (82) విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఒంటరిగా ఉంటున్న సాలెమ్మ శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లింది. కళ్లు సరిగా కనిపించని సాలెమ్మ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదవశాత్తు తాకింది. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

రాజకీయమంటే భూ ఆక్రమణలు కాదు

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అధికారమితిచ్చింది రాజకీయాలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికో, కొట్టేయడానికో కాదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లను రెగ్యులరైజ్ చేయడానికి విధి విధానాలు తెలియచేడానికి ఆదివారం సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సెలవులో ఉండడంతో ఆయన వచ్చిన తరువాత సమావేశం నిర్వహిస్తామన్నారు. అందులోనే రియల్టర్లకు, కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విధానాలు రూపొందించి తెలియచేస్తామన్నారు. ప్రభుత్వ, నిషేధిత భూములపై వచ్చిన ఎన్‌ఓసీలను విచారిస్తామన్నారు. ప్రభుత్వ భూముల జోలికి ఏపార్టీ వారొచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. ఊరు బాగుకోసమే ఈచర్యలు చేస్తున్నాం తప్ప, ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదన్నారు. డాక్యుమెంటు రైటర్లు ఉన్నవి లేనట్లుగా ప్రచారం చేస్తే సహించమన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల దందా ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో కూడా అవినీతి జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న కందికుంట

సింగప్పకుంటకు నీటి విడుదల

తాడిమర్రి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఎగువ భాగంలో ఉన్న దేశాయి సింగప్పకుంటకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని శనివారం మధ్యాహ్నం విడుదల చేశారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌ను కలిసి తమకు నీటిని తరలించేందుకు మోటార్లు, పైపులు ఇవ్వాలని 10 రోజుల క్రితం కోరగా స్పందించిన ఆయన వెంటనే పనులు ప్రారంభించి శనివారం నుంచి నీటిని విడుదల చేయించారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో వెళ్తున్న నీటిని ఒక కిలోమీటరు మేర పైపులైన్ ఏర్పాటుచేసి నీటిని తరలించే పని మొదలు పెట్టారు. గ్రామ రైతులతో కలిసి టీడీపీ మండల కన్వీనర్ కూచిరామ్మోహన్ ప్రారంభించారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్దన్, రైతులు శ్రీనివాసరెడ్డి, పక్కీర్‌రెడ్డి, రాము, భాస్కర్‌గౌడ్, శివంపల్లిరంగయ్య, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న నాయకులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



ఎన్నికల కేంద్రం వద్ద పోలీసుబందోబస్తు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ఎన్నికలకు ఎస్పీ రత్న ఆదేశాలతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎక్కడా ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. ముందస్తుగా గ్రామాల్లో ఇరుపార్టీల వారితో చర్చించి ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని సూచించారు.

నూతన కార్యవర్గం

ధర్మవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం సత్యసాయిజిల్లా విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడిగా విశ్వనాథ్, ప్రధానకార్యదర్శిగా రాము, కోశాధికారిగా ఖాజాపీరా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రమౌళిలను ఎంపికచేశారు. పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు చలపతి పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

గాండ్లపెంట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాభివృద్ధిపై సోమ, మంగళవారాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి శనివారం ఓప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు వివిధ శాఖలాధికారులకు ఆయా పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లుచెప్పారు. శిక్షణకు హాజరుకావలన్నారు.

రెచ్చిపోయిన బైక్ రైడర్లు



జాతీయ రహదారిపై హల్‌చల్ చేస్తున్న బైక్ రైడర్లు

పెనుకొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్నాటక, ఇతర ప్రాంతాల నుంచి శ్రీబాబయ్యస్వామి గంధం ఉరుసు కార్యక్రమానికి వచ్చిన పలువురు బైక్‌రైడర్లు శనివారం ఉదయం వరకు 44వ జాతీయ రహదారిపై భయానక విన్యాసాలు చేస్తూ రెచ్చిపోయారు. ఈ బైక్ రైసింగ్ పోటీల్లో గెలుపొందినవారు జాతీయ రహదారిపైనే చిందులువేశారు. అటువైపు వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవన్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు జాతీయరహదారి బెహలూల్‌షా ఖాద్రి దర్గావద్దకు చేరుకుని బైక్ విన్యాసాలు చేస్తున్న 50మంది యువకుల ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

క్రీడకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



క్రీడాకారులకు నగదు పంపిణీచేస్తున్న సామకోటి

బుక్కపట్నం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించడమే తన లక్ష్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రంలో జిల్లాస్థాయివాలీబాల్ పోటీలను నిర్వహించనున్నారు. నిర్వాకులకు శనివారం రూ.20వేల నగదును అందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అందుబాటులో ఉంటూ సహకరిస్తానన్నారు. 24నుంచి పోటీలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు దీలీప్, జగదీష్, సాయి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనంతపురంజిల్లా గుంతకల్లు రైల్వే క్రీడామైదానంలో శనివారం నిర్వహించిన జూనియర్స్ కబడ్డీ పోటీలలో ధర్మవరం పట్టణానికి చెందిన నవ్య, ఉష ఎంపికైనట్లు కోచ్ పృథ్వీ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 22 నుంచి 25వతేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు.



ఎంపికైన నవ్య, ఉష

జంప్‌రోప్ రాష్ట్రస్థాయి పోటీలు



జంప్‌రోప్ పిరమిడ్ చేస్తున్న విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీషుమీడియం పాఠశాలలో శనివారం రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు సత్యసాయి జంప్‌రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొని పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జంప్‌రోప్ పోటీలు నిర్వహించడం గర్వకారణన్నారు. రెండురోజులపాటు జరిగే పోటీల్లో మొదటిరోజు 4ఇన్‌టూ 30రిలే, ఎల్ఆర్ఎస్, జంప్‌రోప్ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఇస్మాయిల్, కార్యదర్శి నరసింహానాయక్, పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఫకృద్దీన్, ఆర్గనైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజీకేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం

● జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్



పుట్టపర్తి: లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి రాకేష్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీకాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారమని పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి రాకేష్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని జూనియర్‌సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి రాకేష్ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సీజ్‌మనీ 37,320, సివిల్, క్రిమినల్, బ్యాంకు ప్రీలిటిగేషన్ కింద కేసులకు సంబంధించి రూ.16,54,160 విలువైన కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం 129 కేసులు పరిష్కరించామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, లెక్కల యదుభూషణ్, పూజారి ప్రసాద్, నిడిమామిడి శ్రీనివాసులు, నాగేంద్ర, భారతిరెడ్డి, చల్లా చంద్రశేఖర్, కుంచెపు శ్రీనివాసులు, ఝాన్సీరాణి, అరుణ్‌కిరణ్, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్, సివిల్‌క్లర్క్ అశ్వత్థ నారాయణ, ఎంఎల్ఏసీ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

ప్రజా న్యాయస్థానంతో ప్రశాంతత: న్యాయాధికారి జయలక్ష్మి

కదిరిలీగల్: ప్రజా న్యాయస్థానాలతో కేసుల పరిష్కారం వల్ల ప్రశాంతతకు తావిస్తుందని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను కోర్టుల ఆవరణలో ఆమె శనివారం ప్రారంభించారు. తాను ఒక బెంచుకు న్యాయాధికారులు ఎస్ ప్రతిమ, పీ మీనాక్షిసుందరి, ఇతర రెండు బెంచులకు నేతృత్వం వహించి కేసులను పరిష్కరించారు. న్యాయాధికారులకు సహాయంగా న్యాయవాదులు అంబటి శివప్రసాద్, రవీంద్ర, క్షత్రియనాయక్, అంజనేయులు, జ్ఞానేందర్‌రెడ్డి, కాలేనాయక్ వ్యవహరించారు. మూడు బెంచ్‌ల ద్వారా మొత్తం 259 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. కేసుల పరిష్కారం అనంతరం ఎలాంటి సమస్యలు తలెత్తవని న్యాయాధికారి స్పష్టం చేశారు.

రాజీమార్గంతో జీవితం సుఖమయం

ధర్మవరం: రాజీమార్గంతో జీవితం సుఖమయం అవుతుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి రమ్యసాయి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయాధికారులు మాట్లాడుతూ క్షణికావేశానికిలోనై తప్పులు చేసి కేసుల్లో ఇరుక్కుని కోర్టులు చుట్టూ తిరుగుతున్నారన్నారు. అలాంటి వారికోసం లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 371 కేసులను పరిష్కరించినట్లు వారు తెలిపారు.



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి మీనాక్షిసుందరి



ధర్మవరంలో కేసులు పరిష్కరిస్తున్న న్యాయాధికారి

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న అయ్యప్పస్వామి

బత్తలపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మాలధారులు భజనలు చేస్తుండగా వాహనం ముందు బాలికలు జ్యోతులు పట్టుకుని పురవీధుల్లో ఊరేగించారు. గురుస్వామి శెట్టప్పస్వామి, జక్కంపూటి సత్యనారాయణ, నాగభుషణ, పురుషోత్తంచౌదరి, ప్రతాప్, బొజ్జప్ప, ప్రకాష్, రంగన్న, అప్పస్వామి, రాము, సూరి, తిక్కస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పరిటాలసునీత, శ్రీరామ్‌లను కలిసిన ధర్మవరం చెరువు సంఘం సభ్యులు

ధర్మవరంరూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెరువు సంఘం అధ్యక్షుడిగా రేనాటి శ్రీనివాసులుతో పాటు సభ్యులు ఎన్నికకావడంతో శనివారం రాత్రి వారు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌లను అనంతపురంలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, ప్రసాద్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



చెన్నయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరంరూరల్/ధర్మవరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నయ్య (83) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ గ్రామానికి వెళ్లి చెన్నయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుమారుడు భాస్కర్‌చౌదరిని పరామర్శించారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి, ప్రధానకార్యదర్శి విజయ్‌సారథి, మాజీ జడ్పీటీసీ రామాంజనేయులు, రాఘవరెడ్డి, విజయ్‌చౌదరి, రమణ, నరసింహులు, సుధాకర్, అశోక్ ఉన్నారు.

స్ప్రింక్లర్ పరికరాలను ధ్వంసం చేసిన దుండగులు



ధ్వంసమైన పరికరాలను చూపుతున్న రైతు నరసింహులు

కొత్తచెరువు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామంలో నివసిస్తున్న కొడపగానిపల్లి నరసింహులుకు చెందిన స్ప్రింక్లర్ల పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పొలానికి స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించేందుకు స్ప్రింక్లర్లను రైతు ఏర్పాటు చేశాడు. గుర్తుతెలియని దుండగులు స్ప్రింక్లర్లతోపాటు బోరుకు అమర్చిన కేబుల్ వైరును కాల్చివేశారని రైతు తెలిపాడు. దీనిపై కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు

కదిరి అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలిస్తే కేసులు నమోదు చేస్తామనం రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని సున్నపుగుట్ట తండా బైపాస్ రోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డుపై మైనర్లు ద్విచక్రహనాలు నడుపుతుండగా, స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

రాజ్యాంగ పరిరక్షణ సభకు తరలిరండి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కడపలో ఆదివారం జరుగనున్న రాజ్యాంగ పరిరక్షణ జాతీయ సమైక్యత బహిరంగసభకు ముస్లింలు తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ శనివారం ఓప్రకటనలో పిలుపునిచ్చారు. జమాయిత్ ఉలేమాహింద్ అధ్యక్షుడు హజరత్ మౌలానా సయ్యద్ అర్షద్ మదనీ ఆధ్వర్యంలో బహిరంగసభ ఉంటుందన్నారు. సభలో ముస్లింలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు, జాతీయసమైక్యతను పెంపొందించడంలో ముస్లింల పాత్ర, వక్ఫ్ సవరణ చట్టంవంటి అంశాలపై పెద్దల ప్రసంగాలు ఉంటాయన్నారు. ముస్లింలు పెద్దఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు.

'వైసీపీ పాలనలో రైతులకు ఒరిగిందేమీలేదు'

పుట్టపర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రైతులకు ఒరిగిందేమిలేదని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు దారపనేని చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు మేలు చేయకపోగా నేడు కూటమి ప్రభుత్వంలో రైతులు నష్టపోయారంటూ ఆపార్టీ నాయకులు దొంగ ఏడుపు ఏడవడం విడ్డూరంగా ఉందన్నారు. నాడు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కేవలం రూ.7,500 మాత్రమే అందించారని, కూటమి ప్రభుత్వం రెట్టింపు ఇస్తుందన్నారు. చంద్రబాబుపాలనలో రైతులకు వ్యవసాయ యంత్రాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీతో అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం ఒక్క స్ప్రింక్లర్ పైపులు కానీ అందించిన దాఖలాలు లేవన్నారు.

క్లుప్తంగా..

రెచ్చిపోయిన బైక్ రైడర్లు



జాతీయ రహదారిపై హల్‌చల్ చేస్తున్న బైక్ రైడర్లు

పెనుకొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్నాటక, ఇతర ప్రాంతాల నుంచి శ్రీబాబయ్యస్వామి గంధం ఉరుసు కార్యక్రమానికి వచ్చిన పలువురు బైక్‌రైడర్లు శనివారం ఉదయం వరకు 44వ జాతీయ రహదారిపై భయానక విన్యాసాలు చేస్తూ రెచ్చిపోయారు. ఈ బైక్ రైసింగ్ పోటీల్లో గెలుపొందినవారు జాతీయ రహదారిపైనే చిందులువేశారు. అటువైపు వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు జాతీయరహదారి బెహలూల్‌షా ఖాద్రి దర్గావద్దకు చేరుకుని బైక్ విన్యాసాలు చేస్తున్న 50మంది యువకుల ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బైక్ రైడర్లకు ఎస్పీ వార్నింగ్

శ్రీబాబయ్య గంధం ఉరుసు సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన జిల్లా ఎస్పీ రత్న శనివారం బైక్ రైడర్లను హెచ్చరించారు. ఈ క్రమంలో బైక్ రైడర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు ఫోన్‌ద్వారా సూచనలు అందించారు.

ఘనంగా దత్త జయంతి



హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పెనుకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ షిర్డీగా పేరుగాంచిన పట్టణంలోని షిర్డీసాయిమందిరంలో దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం దత్త జయంతిని పురస్కరించుకుని అర్చకులు సుబ్ర మణ్య శాస్త్రి, వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వ ర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, సాయినాథ, దత్తాత్రేయ, రుద్రస్వాహాకార హోమాలను న్యాయవాది ధర్మేంద్రరెడ్డి దంపతులచే చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం నుంచి అఖండ సాయినామ సంకీర్తన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, సురేష్‌కుమార్, ఫణీంద్రతో పాల్గొన్నారు.

పెండింగ్ మెస్ చార్జీలను విడుదల చేయండి

పెనుకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అతిథిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు అఖిల, నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య, జిల్లా అధ్యక్షులు జగదీశ్, మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. శనివారం మంత్రిని కలిసి వినతిని అందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో చదువుతున్న 2733 ఉన్నాయని, వీటిలో 3,13,695మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వీరికి రావాల్సిన మెస్‌చార్జీలు రాలేదన్నారు. వీటివల్ల విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నట్లు తెలిపారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్‌చార్జీలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు జగదీశ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

5న హైందవ శంఖారావం

మడకశిరటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5న విజయవాడలో జరుగుతున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని సత్యసాయి జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు వేదవ్యాస్ కోరారు. శనివారం పట్టణంలోని గాంధీ బజార్‌లో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణ, నిర్వహణను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని, హిందూ ధర్మాన్ని కాపాడుతూ ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. భారత ఖండంలో 69 లక్షల చదరపు కిలోమీటర్లలో కజకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ అంటూ భూ భాగాలను పంచుతూ మిగిలిన 33 లక్షల చదరపు కిలోమీటర్లను కూడా వక్ఫ్‌బోర్డు అంటూ పేరుపెట్టి విభజిస్తున్నారని అన్నారు.

దొంగకు దేహశుద్ధి

లేపాక్షి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): పులమతి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి హుండీని పగలకొట్టారు. ఆ సమయంలో శబ్దం రాగా చుట్టుపక్కల ఇళ్లలోని ప్రజలు మేలుకుని ఆలయంలోకి వెళ్లి చూడగా ఓ వ్యక్తి హుండీని పగలకొట్టి అందులోని నగదును దొంగిలించడానికి ప్రయత్నిస్తున్న దృశ్యం కంటబడింది. వెంటనే గ్రామస్థులు అతనికి దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. దొంగ తన పేరు హరీష్ అని, ఊరు పేరు చెప్పడంలేదని కన్నడలో మాట్లాడుతున్నాడన్నారు. వేలిముద్రల నిర్ధారణ కోసం అతడిని హిందూపురం తరలించి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శని ఆలయంలో పూజలు

పావగడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతిని పట్టణంలోని శని ఆలయంలో శనివారం వేల మంది అయ్యప్ప భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు శనేశ్వర శీతలాంబను దర్శించుకొన్న అనంతరం దత్తజయంతిలో పాల్గొని దత్తాత్రేయుడికి తైలాభిషేకం, కుంకుమార్చన, రుద్రాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేసి తమ భక్తిని చాటుకొన్నారు. మడకశిర నుండి దాదాపు వెయ్యి మందికి పైగా అయ్యప్ప భక్తులు శని సన్నిధిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే ఇంటి ముందు తమటే చళువళి

పావగడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి శాసనసభ్యుడి ఇంటి ముందు ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలపాలని కోరుతూ శనివారం దళిత నాయకులు పెద్ద సంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు. తమటే చళువళి సందర్భంగా పావగడ తాలూకా పరిధిలోని హనుమంతనహళ్లి గ్రామంలో ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ ఇంటి ముందు నిరసన తెలిపారు. ఈసందర్భంగా దళిత మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణపై ఆగస్టు 1వతేదీన సుప్రీం కోర్టు తీర్పు చెప్పినా ఇప్పటి వరకు వర్గీకరణ అమలు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

అడుగడుగునా ఉల్లంఘనలే

- ట్రాఫిక్ విధులను మరచిన పోలీసులు
- హెల్మెట్ల ధారణపై నిర్లక్ష్యం
- ఆక్రమణలతో ఇరుకుగా మారిన కూడళ్లు
- రోడ్డు ప్రమాదాలపై కోర్టు ఆదేశాలు బేఖాతరు



నిరుపయోగంగా పోలీస్ కంట్రోల్

హిందూపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ రోడ్డుప్రమాదాల్లో మృతి చెందుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని న్యాయస్థానం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గతంలో ఆదేశాలు ఇచ్చింది. హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈనెల 10న హైకోర్టు ఆదేశించింది. అంతేకాక దానికి సంబంధించిన చలానాలు కట్టని వారి ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలంటూ సూచించింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు కోర్టు భావించింది. ఆక్రమణల కారణంగా కుంచించుకుపోతున్న రోడ్లు కూడా ఇందుకు మరో కారణమని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది.

ప్రాణాలుపోతున్నా చలనం లేదా?

హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. బైక్‌పై ప్రయాణిస్తున్నప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి. హెల్మెట్ పెట్టుకోకుండా వాహనం నడిపేవారు కొన్నిసార్లు ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు. అయితే ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన వారి వివరాలు పరిశీలిస్తే హెల్మెట్ ధరించకపోవడంవల్లే ఈ ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. డబ్ల్యుహెచ్ఓ, ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడంతో నిమిషానికి రెండుకంటే ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలుస్తోంది. ప్రతి యేడాది 13లక్షల మందికిపైగా మరణిస్తున్నట్లు అంచనా. రాష్ట్రంలో 3నెలల వ్యవధిలో హెల్మెట్ ధరించకుండా 667మంది చనిపోవడంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో అధికశాతం యువతే ఉంటున్నారు.

ఇటీవల లేపాక్షి మండల పరిధిలో ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడిని కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ యువకుడు హెల్మెట్ ధరించలేదు. గత నెలలో హిందూపురం మండలం తూముకుంట వద్ద ఇద్దరు యువకులు ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందారు. అదేవిధంగా పరిగి మండలం బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గతవారం హిందూపురం మండలంలో లారీని ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ మరణాలన్నీ హెల్మెట్ ధరించకపోవడంవల్లనే జరిగాయని తెలుస్తోంది.



ప్రధాన కూడలిలో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

రోడ్డు ప్రమాద నివారణలో కీలక భూమిక పోషించాల్సిన రవాణాశాఖ, పోలీసశాఖ, మునిసిపాలిటీల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎందుకంటే గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆ మూడు శాఖల మధ్య సమన్వయం లేకుండా పోయింది. ట్రాఫిక్ నిబంధనలను రవాణాశాఖ మరిచిపోయింది. ఐదేళ్ల క్రితం హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించడమేకాక చర్యలు తీసుకునేవారు. ఇటీవల హెల్మెట్ వాడకంపై అటు రవాణాశాఖ, ఇటు పోలీస్‌శాఖ అవగాహన కల్పించడంతోపాటు చర్యలకు ఉపక్రమించడంలేదు.

ఇరకాటంగా మారిన రోడ్లు

ఎక్కడచూసినా రోడ్ల ఆక్రమణే ముఖ్యసమస్యగా మారింది. రోడ్లలో వాహనాలను పార్క్‌చేయడం, రోడ్ల మార్జిన్లలో దుకాణాలను ఏర్పాటుచేయడం ఇందులో ముఖ్యమైనవి. పట్టణాల్లో ఏ కూడలిచూసినా ఇలాంటి దృశ్యాలు మనకు కనిపిస్తాయి. వాటి గురించి మునిసిపాలిటీ, ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు కనిపించడంలేదు. సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించని వారి కోసం స్పెషల్ డ్రైవ్



హెల్మెట్ ధరించకుండా, సీటుబెల్ట్ పెట్టుకోకుండా ఎవరైనా వాహనాలు నడిపితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇకమీదట అలాంటివారికి జరిమానా విధించడంతో పాటు కేంద్ర వాహన చట్టం నిబంధనల మేరకు కేసు కూడా నమోదు చేస్తాం. **మహేష్, డీఎస్పీ, హిందూపురం**

ఎన్డీఏ కూటమి పాలనలో అందరికీ న్యాయం



మంత్రిని సన్మానిస్తున్న సాగునీటి సంఘం నాయకులు

పెనుకొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని బీసీ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం జరిగిన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్ల ఎన్నిక పూర్తయింది. గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మంత్రిని స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కష్టపడిన వారిని గుర్తిస్తుందని వారికి తగిన బాధ్యతాయుతమైన పదవులు కూడా అప్పజెబుతుందన్నారు. ఎంపికైన చెరువు సంఘం అధ్యక్షులు రానున్న రోజుల్లో చెరువుల అభివృద్ధికి కృషిచేసి రైతుల సంక్షేమానికి పాటుడాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిమడుగు వెంకటరాముడు, వెంకటగిరిపాళ్యం శీన, తదితర

గృహ ప్రవేశానికి హాజరైన మంత్రి

సోమందేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపల్లిలో టీడీపీ నాయకులు ప్రభాకర్ నూతన గృహప్రవేశానికి శనివారం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత హాజరయ్యారు. స్థానిక నాయకులతో కలసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకుని స్థానిక సమస్యలపై ఆరాతీశారు. నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఆమె కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నాయకులు ఆదిశలో ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తనకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, చంద్ర, సిద్దలింగప్ప, వడ్డె సూరీ, కురుబ శ్రీరాములు, కిష్టప్ప, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

బాబయ్యస్వామి గంధం ఉరుసుకు వచ్చిన భక్తులకు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక పెట్రోల్‌బంక్ వద్ద వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతియేడాది బాబయ్యస్వామి ఉరుసు సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెరిగిపోతున్న ట్రాఫిక్ .... తప్పని ఇబ్బందులు

- రోడ్లలోనే వాహనాల పార్కింగ్

మడకశిర,డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరగడంతో ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. మడకశిర పట్టణంలోని పలుకూడళ్ళలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, వాల్మీకీ సర్కిళ్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. గురువారం జరిగే వారపు సంతరోజు మరి ఎక్కువ రద్దీగా ఉంటుంది. వాహనాలు నిలిపేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలను రోడ్డుకు ఇరువైపుల నిలపడంతో వాహనదారులు రాక పోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మడకశిర మేజర్ పంచాయితీ నుంచి నగరపంచాయితీ గా మారి పది సంవత్సరాలు కావస్తోంది. గతంలో కంటే జనాభా కూడా పెరిగిపోయింది. కర్ణాటక సరిహద్దులో ఉండడం ప్రధాన రహదారి కూడా పట్టణం సమీపంలో నుంచి వెళ్ళడం తో ట్రాఫిక్ కూడా అధికంగా ఉంటుంది. పరిసర గ్రామాల నుంచి, పక్క మండలాల నుంచి విద్యార్థులు చదువుల కోసం, వ్యాపార నిమిత్తం అధిక సంఖ్యలో పట్టణానికి వస్తుంటున్నారు. ఉన్నతాధికారులు ట్రాఫిక్ సమస్యలపై దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌దే

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిరటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ తీసుకొన్న అనాలోచిత నిర్ణయాల వల్ల సాగునీటి సంఘాలు నిర్వీర్యం అయ్యాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు. నియోజకవర్గంలో 47 చోట్ల జరిగిన సాగునీటి ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో ఎక్కడికక్కడ చెరువుల్లో కంపచెట్లు పెరిగాయని, అయినా రైతాంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించారని విమర్శించారు. ఈసందర్భంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులతోపాటు కౌన్సిలర్లు ఉమాశంకర్, తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో సజావుగా సాగునీటి సంఘం ఎన్నికలు

మడకశిరటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో 47 సాగునీటి సంఘం ఎన్నికలకుగాను శనివారం ఎన్నికలు నిర్వహించారు. అందులో 47 చోట్ల తెలుగుదేశం పార్టీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుడిబండ మండల పరిధిలోని నాచేపల్లి, గొల్లపల్లి సాగునీటి సంఘం ఎన్నికల్లో మూడు టీసీ సభ్యుల స్థానాలను ఖాళీగా పెట్టారు. అయితే అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు యథావిధిగా సాగినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మడకశిర మండలంలో 12 సాగునీటి సంఘం ఎన్నికలకుగాను ఐదు చోట్ల మాత్రమే పోటీ అధికంగా ఉండటంతో ఎన్నిక అనివార్యం అయింది. అక్కడ పోలింగ్ ద్వారా ఎన్నుకొన్నారు. అందులో సైతం తెలుగుదేశం పార్టీ మద్దతుదారులే అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. మడకశిర చెరువుకు జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షులుగా హనుమంతేగౌడ్, ఉపాధ్యక్షులుగా జి.నరసప్పలు ఎన్నికైనట్లు కమీషనర్ రంగస్వామి తెలిపారు.



ఎన్నికైన వారికి డిక్లరేషన్ అందజేస్తున్న కమిషనర్ రంగస్వామి



కాకి నీటి సంఘం అధ్యక్షులు బ్యాటప్పకు సన్మానం

రొళ్ల: రొళ్ల మండలంలోని ఐదు సాగునీటి సంఘాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కె.బ్యాడిగెర సాగునీటి సంఘం అధ్యక్షులుగా సిద్దగంగమ్మ, ఉపాధ్యక్షులు రవిశంకర్, కాకి సాగునీటి సంఘం అధ్యక్షులుగా బ్యాటప్ప, ఉపాధ్యక్షులుగా ధరణేంద్రప్ప, రొళ్ల సాగునీటి సంఘం అధ్యక్షులుగా నంజేగౌడ్, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అగళి: అగళి మండలంలో ఏడు ఆయకట్టు చెరువులకు శనివారం జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో అగళి పంచాయతీ ఆయకట్టు అధ్యక్షుడుగా మల్లికార్జున, ఉపాధ్యక్షులు ప్రమీళమ్మ, మధుడిలో శ్రీధర్, రమేష్, ఇరిగేపల్లిలో మంజునాథ్, తిమ్మరాయప్ప, కోడిపల్లిలో శారదమ్మ, గుండయ్య, ఇనగలూరులో నరసింహప్ప, రామచంద్రప్ప ఎన్నికయ్యారు.

గుడిబండ:గుడిబండ మండలంలో శనివారం జరిగిన చెరువు ఆయకట్టు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మోరుబాగల్ చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడిగా హనుమంతరాయప్ప, ఉపాధ్యక్షులుగా నరసింహమూర్తి, ముతుకూరు ఆయకట్టు సంఘం అధ్యక్షురాలిగా అమ్మాజమ్మ ఎన్నికయ్యారు.

అమరాపురం :మండలంలోని 14 సాగునీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.అమరాపురం చెరువు అధ్యక్షులుగా వీరక్యాతరాయ, ఉపాధ్యక్షులుగా మధుమూర్తి, వలస చెరువు అధ్యక్షులుగా అరుణ, ఉపాధ్యక్షులుగా విద్యాసాగర్, కె.శివరం చెరువు అధ్యక్షులుగా ఈరమల్లప్ప, ఉపాధ్యక్షులుగా కెంచమ్మ, చిట్నడుకు చెరువు అధ్యక్షులుగా ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులుగా రుద్రముని ఎన్నికయ్యారు.



కె.శివరం నుంచి ఈరమల్లప్ప



ముతుకూరు సంఘం అధ్యక్షురాలికి సన్మానం

హిందూపురంలో అన్నీ ఏకగ్రీవాలే

ముగిసిన సాగునీటి సమరం

హిందూపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల సమరం శనివారం ప్రశాంతంగా ముగిసింది. హిందూపురం నియోజకవర్గంలో 44చెరువులు ఉండగా అన్నిటికీ ఎన్నికలు జరగ్గా అన్నీఏకగ్రీవాలయ్యాయి. ఉదయం 8గంటల నుంచే సాగునీటి సంఘాల ఎన్నిక ప్రారంభమైంది. అయితే వైసీపీ ఎన్నికలు బహిష్కరించడంతో కూటమి పార్టీ నాయకులే ఎన్నికల్లో పాల్గొన్నారు. దీంతో ప్రతి చెరువుకు ఆరుగురిని ఎన్నుకోగా వారిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, నలుగురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన అధ్యక్షులు, డైరెక్టర్లు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసానికి వచ్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఎన్నికైన చెరువు సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లను టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ బాలాజీలు అభినందించారు.

సోమందేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో శనివారం జరిగిన సాగునీటి ఎన్నికలలో భాగంగా లేపాక్షి మండలంలోని 14చెరువులకు ఎన్నికలు సజావుగా జరిగాయి. అన్ని చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ తెలిపారు.



కొట్నూరు చెరువు సంఘం అధ్యక్షురాలిని అభినందిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్‌లో


పెనుకొండ మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించిన చెరువు సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద తొమ్మిది చెరువులున్నాయి. ముత్యాల చెరువుకు అధ్యక్షునిగా మాదినేని చలపతి, ఉపాధ్యక్షులుగా రామాంజినేయులు, గుట్టూరులో దేవాంగం వెంకటేశులు, నాగలక్ష్మమ్మ, మునిమడుగులో మల్లికార్జున, గొర్ల రంగప్ప, యర్రమంచిలో కె. పెద్దన్న, సి. ఆంజనేయులు, మావటూరులో నీరుగంటినాగరాజు, నాగన్న, చిన్నపరెడ్డిపల్లిలో ఎ. శ్రీనివాసులు, కె. నాగమణి, నాగలూరులో ఎం. శంకరయ్య, అడదాకులపల్లిలో మారుతి, నరసింహారెడ్డి, శెట్టిపల్లిలో భాస్కర్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు వీరికి డిక్లరేషన్‌ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవయ్య, మునిమడుగు చిన్నవెంకటరాముడు, మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్, సిద్దయ్య, గుట్టూరు సూరీ, వీజీపాళ్యం శీన, సోమశేఖర్, సన్నపోతన్న, బాలు, ప్రసాద్, సుబ్రమణ్యం, మావటూరు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.




బేవనహళ్లి చెరువు అధ్యక్షునికి సన్మానం

పరిగిలో

పరిగి మండలంలోని 9 చెరువులకు శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించగా ఎలాంటి పోటీ అభ్యర్థులు లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఎంపికైన అభ్యర్థులకు కూటమి నాయకులు అభినందనలుతెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంగడు యాదవ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రత్యూశ, కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలచెరువు మాదినేని చలపతి



మావటూరు అధ్యక్షుడు నీరుగంటి నాగరాజు



గుట్టూరు అధ్యక్షుడు డి.వెంకటేశులు



మునిమడుగు మల్లికార్జున



యర్రమంచి కె. పెద్దన్న

రాజీమార్గంతో దేన్నైనా సాధించవచ్చు

- అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ
- మెగా లోక్ అదాలత్‌లో 305కేసుల పరిష్కారం



తీర్పు ప్రతిని అందజేస్తున్న న్యాయాధికారి

హిందూపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి):కక్షిదారులు కోర్టు చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందులు పడేదాని కంటే రాజీమార్గంతో వెళితే ఎలాంటి కేసైనా పరిష్కరించుకోవచ్చని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 305కేసులను పరిష్కరించారు. ఇందులో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 43 కేసులు పరిష్కరించి రూ.88వేలు అపరాధ రుసుం విధించారు. అక్రమ మద్యం రవాణా 93కేసులు పరిష్కరించి వారి నుంచి రూ.4,23,160 జరిమానా కట్టించారు. ఐపీసీ కేసులు 84పరిష్కరించి రూ.11,400, ప్రమాదబీమా 2 కేసులు పరిష్కరించి బాధితులకు రూ.15.50లక్షలు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మీ, లోక్ అదాలత్ సభ్యులు సుదర్శన్, సంతోష్‌కుమారి, కళావతి, వేణుగోపాల్, గోపాలక్రిష్ణ, అంజినమ్మ, ఏపీపీలు ఇందాద్, నగేష్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పెనుకొండలో 184కేసుల పరిష్కారం

పెనుకొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 184కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం సీనియర్ సివిల్ న్యాయాధికారి మండల న్యాయ సేవాధికార సంస్థ వాసుదేవన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపలసయ్యద్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. ఈ క్రమంలో 93క్రిమినల్, 26ఎక్సైజ్ కేసులు సహా పలు కేసులు పరిష్కారమయ్యాయి.

మడకశిరలో 133 కేసుల పరిష్కారం

మడకశిరటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మడకశిర కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో 133 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్, న్యాయవాదులు హాజరయ్యారు.